సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023




చీనీ టన్ను రూ.32 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి. మార్కెట్‌కు 575 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10, కనిష్టం రూ.3, సరాసరి రూ.7 ప్రకారం అమ్ముడుపోయాయి.

గరిష్టం/కనిష్టం
40.6°/21.9°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. గాలి వేగం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది.



రెచ్చగొడుతూ.. రచ్చ చేస్తూ..

- దారి తప్పుతున్న లోకేష్ 'యువగళం'
- స్థానిక టీడీపీ నేతల స్క్రిప్టుతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- కదిరి, పెనుకొండ, రాప్తాడులోనూ మతిలేని విమర్శలు
- టీడీపీ శ్రేణులను వైఎస్సార్‌సీపీ నేతలపైకి ఉసిగొల్పుతున్న వైనం
- తాజాగా పుట్టపర్తిలో ఉద్రిక్తతలకు ఆజ్యం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర ఘర్షణలకు ఆజ్యం పోస్తోంది. అధికార పక్షం నేతలపై వ్యక్తిగత విమర్శలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఉద్రిక్తతలకు కారణమవుతున్నారు. సమృద్ధిగా కురిసిన వర్షాలకు పైరు పంటలతో ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఒక్కసారిగా అలజడి రేపుతున్నారు. అందరూ కలసి మెలసి పనులు చేసుకుంటూ ముందుకు సాగుతున్న వేళ కలహాలు సృష్టిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను, సమన్వయకర్తలను బూతులు తిడుతూ వారిపై టీడీపీ శ్రేణులను ఉసిగొల్పుతున్న తీరు విమర్శలకు తావిస్తోంది.




ప్రశాంత వాతావరణంలో చర్చించదానికి వచ్చినట్లు డీఎస్పీకి చెబుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పల్లె సమక్షంలో అలజడి సృష్టిస్తున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఐదు రోజుల క్రితం ఉమ్మడి అనంతపురం జిల్లా పుట్టపర్తిలో కొనసాగింది. ఈ సందర్భంగా లోకేష్ స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేశారు. ఆరోపణలు నిరూపించాలంటూ ఎమ్మెల్యే దుద్దుకుంట సవాల్ విసిరారు. దీనికి మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి ప్రతిస్పందించారు. శనివారం తన అనుచరులతో పుట్టపర్తిలోని సత్యమ్మ గుడి వద్దకు వెళ్లి వాహనంపైకి ఎక్కి తొడగొట్టారు. కవ్వింపు చర్యలకు దిగారు. తన అనుచరులను రెచ్చగొట్టారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శాంతియుతంగా చర్చించడానికి అక్కడ సిద్ధంగా ఉన్నప్పటికీ 'పల్లె' మాత్రం ఉద్రిక్తతలకు ఆజ్యం పోశారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టించారు. పోలీసులు నచ్చజెబుతున్నా వినకుండా ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టడానికి ప్రయత్నించారు.

కదిరి నుంచి ఇదే పంథా..

లోకేష్ పాదయాత్ర కదిరి నియోజకవర్గంలో అడుగు పెట్టినప్పటి నుంచి రెచ్చగొట్టే ధోరణితోనే ముందుకు సాగుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేను రెచ్చగొట్టడం, కార్యకర్తల మధ్య చిచ్చుపెట్టడం, ఇరు వర్గాల వారూ కొట్టుకునేలా ప్రేరేపించడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కదిరిలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, ఆ తర్వాత పెనుకొండలో ఎమ్మెల్యే శంకరనారాయణపైనా అర్థపర్థం లేని ఆరోపణలు చేశారు. రాప్తాడులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కించపరుస్తూ మాట్లాడారు. లోకేష్ స్వార్థ రాజకీయాల కోసం ప్రశాంతంగా ఉన్న జిల్లాలో కక్షలు, కార్పణ్యాలకు ఆజ్యం పోస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

స్థానిక నేతల స్క్రిప్టుతో..

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో స్థానిక పరిస్థితులపై లోకేష్‌కు అవగాహన లేదు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు రాసిచ్చిన ఏకపక్ష స్క్రిప్టులు చదువుతూ పోతున్నారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉంటే ఇదంతా చేసేవారు కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పాదయాత్రలో భాగంగా సభలు నిర్వహించడం, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలపై ఉన్నవీ లేనివీ కల్పించి ఆరోపణలు సంధించడం, అక్కడ గొడవలు సృష్టించడం.. వారం రోజులుగా ఇదే ధోరణి కొనసాగుతోంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసినా ఎక్కడా రెచ్చగొట్టిన సందర్భాలు లేవని, ప్రభుత్వ వైఫల్యాల మీద మాత్రమే మాట్లాడేవారని, అప్పట్లో పాదయాత్ర హుందాగా జరిగిందని, జనం కూడా స్వచ్ఛందంగా, తండోపతండాలుగా తరలివచ్చారని ప్రజలు గుర్తు చేస్తున్నారు.

ప్రసాదం తిని 20 మందికి అస్వస్థత



గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తనకల్లు: శ్రీరామనవమి పండుగ రోజున ప్రసాదం తిన్న 20 మంది అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని తొట్లివారిపల్లిలో మార్చి 30న శ్రీరామనవమి సందర్భంగా గ్రామస్తులు స్వామివారి ప్రసాదంగా పానకం తాగారు. ఆలయం వద్దే భోజనం చేశారు. అనంతరం 20 మందికి వాంతులు, విరేచనాలయ్యాయి. ఈ క్రమంలోనే మార్చి 31వ తేదీ ఐదుగురిని తనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ శనివారం రాత్రి గ్రామంలో అత్యవసర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న 15 మందికి చికిత్స చేశారు. అలాగే వైద్యశిబిరంలో మొత్తం 30 మంది గ్రామస్తులకు పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో కొక్కంటి పీహెచ్‌సీ వైద్యాధికారి శివనారాయణ, ఎంపీహెచ్‌ఓ ఓబులేసు, ఏఎన్‌ఎం రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డి, ఆశా కార్యకర్త శైలజ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'పది' విద్యార్థులకు ఉచిత ప్రయాణం

పుట్టపర్తి టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రజా రవాణా అధికారి మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనుండగా, ఆయా రోజుల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ సర్వీసులు తిప్పుతున్నామన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. పరీక్ష ముగిశాక తిరిగి స్వగ్రామాలకు వెళ్లేందుకు కూడా ఈ సౌకర్యం ఉంటుందన్నారు.

ఖాద్రీశుని కల్యాణం.. భక్తులకు అవకాశం



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆర్జిత కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాన్ని దగ్గరుండి జరిపించే అవకాశాన్ని భక్తులకూ కల్పించినట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కెట్ రూ.4 వేల ఉంటుందని, ఒక్క టిక్కెట్‌పై ఐదుగురికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. ఈ నెల 10, 11, 12, 13, 14, 16, 17, 18, 21, 23, 24, 26, 27, 28, 30 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి కల్యాణోత్సవం ఉంటుందని, ఆసక్తి గలవారు ఆయా తేదీల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఏరువాక కేంద్రం ఏర్పాటు

పుట్టపర్తి అర్బన్: నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లాలో రైతుల కోసం ఏరువాక కేంద్రం ఏర్పాటు చేశారు. గతంలో అనంతపురం సమీపంలోని రెడ్డిపల్లిలో ఉన్న ఏరువాక కేంద్రాన్ని జిల్లాకు కేటాయించారు. దీంతో అధికారులు పుట్టపర్తిలోని దీనజనోద్ధరణ భవనాల్లోని రూం నంబర్ 24లో ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఏరువాక కేంద్రం సేవలు రైతులకు అందుబాటులో ఉంటాయని కోఆర్డినేటర్ కె.రామసుబ్బయ్య వెల్లడించారు. పంటల సాగులో రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు శిక్షణ, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తామన్నారు. వ్యవసాయ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు సైతం నిర్వహిస్తామన్నారు.

'పల్లె'కు రాజకీయ సమాధి ఖాయం

- పుట్టపర్తి అభివృద్ధిపై చర్చించడం చేతగాకే 'పల్లె' కుయుక్తులు
- వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టి సానుభూతికి వెంపర్లాట
- 2024 ఎన్నికల్లో పుట్టపర్తిపై ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: ''పుట్టపర్తి ప్రాంత ప్రజలు మూడు పర్యాయాలు అధికారం ఇస్తే పల్లె రఘునాథరెడ్డి మొద్దు నిద్రలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నారు. మంగళగిరి మాలోకం లోకేష్‌తో కలసి అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా పల్లె రఘునాథరెడ్డి ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి. లేకపోతే ప్రజలే రాజకీయ సమాధి కడతారు'' అని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాను పుట్టపర్తి నుంచి రోజూ 200 టిప్పర్లతో ఇసుకను బెంగళూరుకు తరలిస్తున్నానని, బెంగళూరు నుంచి లిక్కర్ ఇక్కడికి తీసుకువస్తున్నానని, బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నానంటూ 'యువగళం'లో లోకేష్ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేశారని, ఇది అతని దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. నిజంగా లోకేష్‌కు, పల్లె రఘునాథరెడ్డికి దమ్ముంటే నిరూపించాలన్నారు. 12 కేసులుంటేనే టీడీపీ టికెట్ అడగాలని లోకేష్ బహిరంగ సభలో చెప్పడం అతని రౌడీ సంస్కృతికి నిదర్శనమన్నారు. లోకేష్ లాంటివారు యూపీ, బిహార్‌లలో పార్టీలు పెట్టుకుంటే మంచిదని, ఏపీలో ఉండటం మన దౌర్భాగ్యమన్నారు. తాము అధికారంలోకి వచ్చాక పుట్టపర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు చేయించి ఈ ప్రాంత శాశ్వత అభివృద్ధికి బాటలు వేశామన్నారు. నిజంగా పల్లె రఘునాథరెడ్డికి ఈ ప్రాంత అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే.. బాలకృష్ణ హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని డిమాండ్ చేసినప్పుడు ఎందుకు నోరు మెదపలేదో చెప్పాలన్నారు. నిత్యం అభివృద్ధి మంత్రం జపిస్తున్న 'పల్లె' తన వ్యవసాయ కళాశాలను ఇక్కడ కాకుండా బుక్కరాయసముద్రంలో ఎందుకు ఏర్పాటు చేశారో చెప్పాలన్నారు.

మా పాలన అభివృద్ధికి నిర్వచనం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా తాము కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అలాగే అభివృద్ధిలో దూసుకుపోతున్నామన్నారు. అందుకే తమ పాలనను అభివృద్ధికి నిర్వచనంగా జనమే చెప్పుకుంటున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 'ప్రజాసంకల్ప'యాత్రలో నల్లమాడ బహిరంగ సభలో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాంతంలో కరువును శాశ్వతంగా పారదోలేందుకు రూ.864 కోట్లతో 193 చెరువులకు హంద్రీ-నీవా ద్వారా నీటిని నింపే కార్యక్రమానికి పరిపాలనా అనుమతులు తెచ్చామన్నారు. 3 టీఎంసీల నీటిని కూడా అధికారికంగా కేటాయింపులు చేయించామన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల మీదుగా ఎన్‌హెచ్-342, గ్రీన్ ఫీల్డ్ హైవేలను నిర్మిస్తున్నామని, నియోజకవర్గంలోని నిరుపేదల కోసం 25 వేల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధిలో తనతో పోటీ పడలేకే 'పల్లె' కుట్రలు, కుతంత్రాలకు తెరతీశారన్నారు. ఆయనకు చేతనైతే అభివృద్ధిలో తమతో పోటీ పడాలని హితవు పలికారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకోకపోతే రాబోవు రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారన్నారు.

న్యాయ పోరాటం చేస్తాం..

లోకేష్ తనపై చేసిన ఆరోపణలకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వెళ్లేలోపు ఆధారాలు చూపించాలని, లేని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. పుట్టపర్తి ప్రాంత అభివృద్ధికి, ప్రశాంతతకు తాము ఎప్పటికీ కట్టుబడి ఉంటామన్నారు. 'పల్లె' తన రాజకీయ లబ్ధి కోసం రెచ్చగొట్టే చర్యలకు దిగడం వల్లే వైఎస్సార్ సీపీ, టీడీపీ శ్రేణులు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

- సత్యమ్మ ఆలయం వద్ద ఘటనపై వీడియో ఫుటేజీ పరిశీలిస్తున్నాం
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ యశ్వంత్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యశ్వంత్

కొత్తచెరువు: పుట్టపర్తి సత్యమ్మగుడి వద్ద శనివారం జరిగిన ఘర్షణకు సంబంధించిన వీడియోలు పరిశీలిస్తున్నామని, వాటి ఆధారంగా ఘటనలో పాల్గొన్న వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'యువగళం' పాదయాత్రలో భాగంగా లోకేష్ మార్చి 25న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిపై ఆరోపణలు చేశారని, ఇందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి స్పందిస్తూ పుట్టపర్తి అభివృద్ధిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ్‌రెడ్డి సోషల్ మీడియాలో దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై అసభ్యకర పదజాలంతో రెచ్చగొట్టే విధంగా ఓ పోస్టు పెట్టారని డీఎస్పీ వివరించారు. ఈక్రమంలోనే ఇరువురు నేతలు పుట్టపర్తిలోని సత్యమ్మ దేవాలయం వద్ద ఏప్రిల్ 1వ తేదీన ప్రమాణం చేసేందుకు సిద్ధమని ప్రకటించారన్నారు. అయితే పుట్టపర్తిలాంటి పవిత్ర స్థలంలో ఇలాంటి వాటికి అనుమతులు లేవని, ఇరుపార్టీల వారికీ తాము ముందస్తు నోటీసులు ఇచ్చామన్నారు.

పోలీసులను తోసుకుని వచ్చిన పల్లె..

నాయకుల సవాళ్ల నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి టీడీపీ కార్యాలయంలో ఉండగా, బయట పోలీసు పహారా ఏర్పాటు చేశామన్నారు. కానీ ఆయన టీడీపీ కార్యాలయంపై నుంచి దూకి పోలీసులను తోసుకుంటూ వారి అనుచరులతో కలిసి సత్యమ్మ గుడి వద్దకు చేరుకున్నారన్నారు. అప్పటికే సత్యమ్మ దేవాలయం వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులకు తాము సర్దిచెప్పి పంపిస్తున్న తరుణంలోనే పల్లె రఘునాథరెడ్డి అక్కడికి చేరుకున్నారు. సవాల్ విసురుతూ అక్కడున్న వైఎస్సార్ సీపీ నేతలను రెచ్చగొట్టడంతో ఇరువర్గాల వారు గుడిబయట ఉన్న చెప్పులు, కొబ్బరి చిప్పలు విసురుకున్నారన్నారు. అప్రమత్తమైన పోలీసులు రెండు వర్గాల వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారన్నారు. ఈ ఘటనలో టీడీపీ శ్రేణులు పోలీస్ జీపు అద్దాలను ధ్వంసం చేశాయన్నారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు..

రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో ఎవరు పోస్టులు పెట్టినా అరెస్ట్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఏ పార్టీ నేతలైనా సరే వ్యక్తిగత విమర్శలు చేసుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐలు బాల సుబ్రహ్మణ్యం రెడ్డి, జయనాయక్ పాల్గొన్నారు.

మాటలొద్దు... సెల్ఫీలే ముద్దు!

- యువగళంలో లోకేష్ ప్రచార ఆర్భాటం



టిడ్కో అపార్ట్‌మెంట్ వద్ద సెల్ఫీకి ఫోజు

ధర్మవరం: లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర కాస్తా 'సెల్ఫీ'ల యాత్రగా మారిపోయింది. మనిషి కనిపిస్తే చాలు లోకేష్ సెల్ఫీ అంటూ మొబైల్ తీస్తున్నారు. శనివారం ధర్మవరం నియోజకవర్గంలో కొనసాగిన పాదయాత్రలోనూ దారిపొడవునా డ్రోన్ కెమెరాలు, లైవ్ వ్యాన్‌లు, సెల్ఫీల హడావుడి తప్ప ప్రజలతో కనీసం మాట్లాడాలన్న ఆసక్తి కూడా చూపలేదు. షెడ్యూల్ మేరకు ఎర్రగుంట సర్కిల్ వద్ద గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిపిన భూసేకరణ వల్ల నష్టపోయిన పోతులనాగేపల్లి రైతులతో లోకేష్ మాటామంతి కార్యక్రమం ఏర్పాటు చేయగా, రైతులు ఎక్కడ ప్రశ్నిస్తారోనని భయపడిన లోకేష్ వారి వినతిపత్రం అందుకుని వెళ్లిపోయారు. ఇక ఇందిరమ్మ కాలనీలోనూ చేనేత కార్మికులకు పది నిమిషాలు కూడా కేటాయించలేదు. పాదయాత్ర ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా వెళ్లినా ఎన్టీఆర్ విగ్రహానికి లోకేష్ కనీసం పూలమాల కూడా వేయపోవడాన్ని టీడీపీ నేతలే తప్పుపడుతున్నారు. ఇక, ధర్మవరం నియోజకవర్గంలో పాదయాత్రను విజయవంతం చేసేందుకు టీడీపీ నాయకులు తంటాలు పడుతున్నారు. రాప్తాడు, అనంతపురం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల నుంచి వాహనాల్లో కార్యకర్తలను తీసుకొస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పోలీసు, రవాణా, జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, మున్సిపల్, ఆర్టీసీ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పలు రహదారులపై గతంలో జరిగిన ప్రమాదాలను సమీక్షించి, రానున్న రోజుల్లో ఆయా ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న హోటళ్లు, డాబాలు, వ్యవసాయ పొలాల గట్లు, ఇరుకు రోడ్లు, నాణ్యత లేని రోడ్లు, జంక్షన్ల వద్ద సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో పరిపాలనా పరమైన అనుమతులు ఉంటే వెంటనే మంజూరు చేస్తామన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ఎద్దుల బండ్ల రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని తద్వారా రాత్రి వేళల్లో ప్రమాదాలు నివారించవచ్చన్నారు. అలాగే రహదారులకు ఇరువైపులా ఆక్రమణలు ఉంటే తొలగించాలన్నారు. ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాలు ఓవర్‌లోడ్‌తో వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద, మలుపుల వద్ద సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లా రవాణా శాఖ అధికారి కరుణసాగర్‌రెడ్డి గత మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 2023 జనవరి, ఫిబ్రవరి నెలల్లో 87 ప్రమాదాలు జరగ్గా, 66 మంది మృతి చెందరని, 112 మంది గాయపడ్డారన్నారు. ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రామకృష్ణప్రసాద్, ఎంవీఐలు సీవీ రమణ, వరప్రసాద్, శివశంకర్, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సంజీవయ్య, నేషనల్ హైవే సైట్ ఇంజినీర్ భరత్, ఆర్టీసీ ఆర్‌ఎం మధుసూదన్, డీఐఓ ఎస్‌ఐసీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారు. ఈ మేరకు సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ అంశాలపై 60 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఇంటర్ ఉత్తీర్ణత కలిగి డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ పాస్/ఫెయిల్ అయిన 20 నుంచి 30 ఏళ్ల లోపు వయసున్న మహిళలు మాత్రమే అర్హులు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనం అందజేస్తారు. శిక్షణ పూర్తికాగానే సర్టిఫికెట్ అందజేస్తారు. పూర్తి వివరాలకు 77807 52418లో సంప్రదించవచ్చు.

'జాబిలి'కి నెల్సన్ మండేలా పురస్కారం



చాంద్‌బాషా అందుకున్న ప్రశంసాపత్రం

పెనుకొండ: వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్న నెల్సన్ మండేలా శాంతి పురస్కారం ... ఈ ఏడాది పెనుకొండకు చెందిన ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు జాబిలి చాంద్‌బాషాకు దక్కింది. శుక్రవారం రాత్రి ఆయనకు వర్చువల్ విధానంలో ప్రశంసాపత్రాన్ని మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.చక్రవర్తి అందజేశారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

తలుపుల: కోడి పందెం నిర్వహిస్తూ పోలీసులకు ఇద్దరు పట్టుబడ్డారు. ఎస్ఐ మగ్బూల్ బాషా తెలిపిన మేరకు... మండలంలోని కేతిరెడ్డివారిపల్లి అటవీ ప్రాంతంలో కోడి పందెలు నిర్వహిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఉదయం అక్కడకు చేరుకున్నారు. పోలీసులను గమనించగానే పలువురు అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు వెంటాడి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. 20 ద్విచక్ర వాహనాలు, ఓ ఆటో స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'సెబ్' దూకుడు

- కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- సరిహద్దులో ముమ్మర తనిఖీలు
- జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ 1,319 కేసులు
- 1,400 మంది అరెస్టు.. 368 వాహనాలు సీజ్
- నాటుసారా, గంజాయి, గుట్కాపై ప్రత్యేక నిఘా


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ సరిహద్దు ప్రాంతాల్లో కట్టుదిట్టంగా వ్యవహరిస్తూ కర్ణాటక మద్యం, గుట్కా, ఎర్ర చందనం, ఇసుక అక్రమ రవాణా, నాటుసారా, గంజాయి, ఆన్‌లైన్ గేమింగ్ అరికట్టేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎక్కడికక్కడ నేరాలను కట్టడి చేసి శభాష్ అనిపించుకున్నారు. జిల్లా ఏర్పడిన ఏడాది వ్యవధిలో మొత్తం 2,340 కేసులు నమోదు చేసి, 3,701 మందిని అరెస్ట్ చేశారు. 742 వాహనాలు సీజ్ చేశారు. కేసుల్లో పట్టుబడిన 16వేల లీటర్ల కర్ణాటక మద్యం ధ్వంసం చేశారు. సుమారు 1.5 లక్షల గుట్కా ప్యాకెట్లు, గేమింగ్ కేసుల్లో 591 మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకా 40 కిలోల గంజాయి కాల్చివేశారు. మరో 40 ఎర్ర చందనం దుంగలను పట్టుకున్నారు. ఇంకో 540 టన్నుల ఇసుక సీజ్ చేశారు.

ఎక్కడికక్కడే పట్టివేత..

నూతన జిల్లాలో తనకల్లు, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, సీకే పల్లి, పెనుకొండ, హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో సెబ్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. వీటి పరిధిలో విస్తృత తనిఖీలు చేపట్టి కర్ణాటక మద్యం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేశారు. ఇప్పటి వరకూ కేవలం కర్ణాటక మద్యం తరలిస్తూ 1,400 మంది పట్టుబడ్డారు. వీరిపై 1,319 కేసులు నమోదయ్యాయి. 368 వాహనాలు సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న 16 వేల లీటర్ల కర్ణాటక మద్యంను ధ్వంసం చేశారు. అలాగే 374 నాటుసారా కేసుల్లో 197 మందిని అరెస్టు చేసి 13 వాహనాలు సీజ్ చేశారు. సుమారు 70 వేల లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిపై 120 కేసులు నమోదయ్యాయి. ఇందులో 184 మంది పట్టుబడ్డారు. మొత్తం 134 వాహనాలు సీజ్ చేశారు. దాదాపు 540 టన్నుల ఇసుక స్వాధీనం చేసుకున్నారు.

జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకూ..			
కేసు వివరం	కేసుల సంఖ్య	అరెస్టులు	సీజ్ చేసిన వాహనాలు
నాటుసారా	374	197 మంది	13
కర్ణాటక మద్యం	1,319	1,400 మంది	368
గుట్కా	152	162 మంది	10
గేమింగ్	301	1,652 మంది	214
గంజాయి	7	23 మంది	1
ఎర్రచందనం	1	9 మంది	2
ఇసుక	120	184 మంది	134

గేమింగ్‌లపై ప్రత్యేక నిఘా..

బెట్టింగ్, జూదం, మట్కా, పేకాట నిర్వహణపై సెబ్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 301 గేమింగ్ కేసులు నమోదు చేయడంతో పాటు 1,652 మందిపై కేసులు నమోదు చేశారు. 214 వాహనాలతో పాటు 591 మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు.

గుట్కా, గంజాయిపై ఉక్కుపాదం..

జిల్లా ఏర్పాటైన ఏడాది వ్యవధిలో 152 గుట్కా కేసులు నమోదయ్యాయి. అందులో 162 మంది అరెస్టయ్యారు. పది వాహనాలను సీజ్ చేసి 1.60 లక్షల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఏడు గంజాయి కేసుల్లో 23 మంది అరెస్టయ్యారు. సుమారు 40 కిలోల గంజాయి కాల్చివేశారు. ఒక్క కేసులో 40 ఎర్ర చందనం దుంగలు పట్టుకున్నారు. తొమ్మిది మందిని అరెస్టు చేశారు.

ఎప్పటికప్పుడు అప్రమత్తం



అందిన సమాచారం మేరకు జిల్లా వ్యాప్తంగా సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేశాం.

– రవికుమార్, సెబ్ సూపరింటెండెంట్

పటిష్ట నిఘా పెట్టాం



నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇసుక, కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై సరిహద్దులో పటిష్ట నిఘా ఏర్పాటు చేశాం. ఉల్లంఘనులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తున్నాం.

– కేవీఆర్‌కే ప్రసాద్, సెబ్ జిల్లా అధికారి

'టోల్' రుసుం పెంపు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాలో వాహనాల ప్రవేశ రుసుం పెంచుతూ భారత జాతీయ రహదారుల సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కారుకు రూ.60 వసూలు చేస్తుండగా.. ఈ మొత్తాన్ని రూ.5 పెంచి రూ.65కు చేర్చారు. అలాగే బస్సులకు రూ.10 పెంచి రూ.215 చొప్పున వసూలు చేస్తున్నారు. సరుకు రవాణా వాహనాలకు రూ. 10 పెంచి రూ.215, పది చక్రాల వాహనాలకు రూ.15 పెంచి రూ.235 చొప్పున వసూలు చేస్తున్నారు.

'సార్ డెనిమ్' అగ్ని ప్రమాదంపై ఫిర్యాదు

లేపాక్షి: మండలంలోని గలిబిపల్లి సమీపంలో ఉన్న సార్ డెనిమ్ పరిశ్రమలో గత నెల 29వ తేదీ రాత్రి చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై కంపెనీ డైరెక్టర్ రిషబ్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని, ఘటనతో స్పిన్నింగ్ మిషన్‌తో పాటు ముడిసరుకు పూర్తిగా కాలిపోయిందని, దీంతో రూ. 29.10 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు.

మున్సిపల్ కార్మికునికి తీవ్ర గాయాలు

ధర్మవరం రూరల్: చెత్త బండిని లోడ్ చేసే యంత్రంలో చేయి పడి మున్సిపల్ కార్మికునికి తీవ్ర గాయాలైన ఘటన ధర్మవరం మున్సిపాలిటీలో శనివారం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన కార్మికుడు లింగన్నను తోటి కార్మికులు అనంతపురం తరలించారు. కార్మికున్ని ఆదుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు సీఐటీయూ నాయకులు విన్నవించారు.

శేషవాహనంపై కోన రంగనాథుడు



తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోనలో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా శేషవాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం ఆలయంలో విశేష పూజలు జరిగాయి. సాయంత్రం ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేసి శేష వాహనంపై అధిష్టింపజేసి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం, ఆలయ పాలక మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేశారు. నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రతిని దహనం చేస్తూ నిరసనలు తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓ పరమేష్ మాట్లాడుతూ వర్సిటీ అధికారుల వైఫల్యాన్ని ఎండగడుతున్న ఎస్ఎఫ్ఐ (నలుగురు విద్యార్థులు) నాయకులపై ఉద్దేశ పూర్వకంగానే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి, గౌసియా, రజిత, కిరణ్, వినోద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ప్రొద్దుటూరు : శ్రీరామనవమిని పురస్కరించుకుని శనివారం సీనియర్ ఎద్దులకు నిర్వహించిన బల ప్రదర్శన పోటీలు రసవత్తరంగా జరిగాయి. స్థానిక వైఎంఆర్ కాలనీలో సీతారామాంజనేయస్వామి దేవస్థాన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన మహమ్మద్ ఆలీ, రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన ప్రసన్నరెడ్డి ఎద్దులు 2534.6 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1,50 లక్షలను మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి అందించారు.

గ్రామస్తులకు పట్టుబడిన గంధం చెట్ల దొంగ


దొంగను కట్టేసిన గ్రామస్తులు

రాయదుర్గం రూరల్: అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా గంధం చెట్లను నరుకుతున్న ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన మేరకు... రాయదుర్గం నివాసి ఎర్రిస్వామి.. రాయంపల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో గంధం చెట్లను సాగు చేస్తున్నాడు. గతంలో మూడు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి అపహరించుకెళ్లారు. ఈ క్రమంలోనే శనివారం వేకువ జాము 2 గంటలకు గంధం చెట్లను నరుకుతున్న శబ్దం కావడంతో ఎర్రిస్వామి తోటకు ఎదురుగా ఉన్న పొలంలోని రైతు గమనించి, వెంటనే ఇరుగు పొరుగు వారిని అప్రమత్తం చేశాడు. అందరూ కలసి ఎర్రిస్వామి తోటలోకి ప్రవేశిస్తుండగా ఇద్దరు దుండగులు గమనించి, అక్కడి నుంచి పారిపోయారు. ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. పట్టుబడిన వ్యక్తిని రాయదుర్గంలోని మొలకాల్మూరు రోడ్డులో, సున్నపు బట్టీల వద్ద నివాసముంటున్న సుంకన్నగా గుర్తించారు. అప్పటికే నరికేసిన రెండు గంధం చెట్లను స్వాధీనం చేసుకుని, సుంకన్నను పట్టుకెళ్లి గ్రామంలోని విద్యుత్ స్తంభానికి కట్టేసి, శనివారం ఉదయం రాయదుర్గంలో ఉన్న తోట యజమానికి అప్పగించారు. దీంతో నిందితుడిని పోలీసుల ఎదుట రైతు ఎర్రిస్వామి హాజరు పరిచాడు. అయితే ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయకుండా విచారణ పేరుతో కాలయాపన చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇదే అంశంపై పోలీసులు మాట్లాడుతూన.. పట్టుబడిన సుంకన్న అనారోగ్యంగా ఉండడంతో కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

పశువులు తరలిస్తున్న కంటైనర్ పట్టివేత


కంటైనర్‌లోని పశువులను లెక్కిస్తున్న యువకుడు

హిందూపురం: తెలంగాణ నుంచి హిందూపురానికి అక్రమంగా భారీ కంటైనర్‌లో తరలించుకు వచ్చిన పశువులను పోలీసులు కాపాడారు. శుక్రవారం రాత్రి కంటైనర్ హిందూపురానికి చేరుకోగానే బోయపేట వద్ద యువకులు అడ్డుకుని పరిశీలించారు. అందులో పశువులున్నట్లుగా గుర్తించి, సమాచారాం అందజేయడంతో వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్‌ను సీజ్ చేశారు. దాదాపు 38 పశువులను కాపాడి, విషయాన్ని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. బాధ్యులపై కేసు నమోదు చేయాలని, పశువులను గోశాలకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించడంతో ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

మార్పు కోసం తపించిన రచయిత సింగమనేని

అనంతపురం కల్చరల్: సమాజ మార్పుకోసం సింగమనేని నారాయణ పరితపించారని, జిల్లా కరువు పరిస్థితులను కళ్లకు కట్టినట్టు కథల రూపంలో వెలుగులోకి తెచ్చారని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. శనివారం గుర్రం జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత సింగమనేని నారాయణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా సాహితీ సదస్సు జరిగింది. స్థానిక నాల్గోరోడ్డులోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి దగ్గుపాటి ప్రకాష్‌రావు అధ్యక్షత వహించారు. కోగటంతో పాటు ఆచార్య బాలసుబ్రమణ్యం, విశ్రాంత ప్రిన్సిపాల్ రంగస్వామి తదితరులు సింగమనేనితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సింగమనేని రాసిన జాలువారిన జూదం, అడుసు, ఒక పయనం, కొత్త అల్లుడు అందరూ చదవాల్సిన కథలన్నారు. అనంతరం కోగటం విజయభాస్కరరెడ్డి శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితలను భావయుక్తంగా చదివి వినిపించిన తీరు ఆకట్టుకుంది.

రేపు మృత్యుంజయ హోమం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని వీసీ అధికార నివాసంలో సోమవారం మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్లు అధికారవర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఉదయం 9:30 గంటలకు సంకల్పం,మధ్యాహ్నం 12:40 గంటలకు పూర్ణాహుతి, 1 గంటకు ప్రసాదం పంపిణీ తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపాయి.

ఇంటర్ పరీక్షలకు 97 మంది గైర్హాజరు

ప్రశాంతి నిలయం: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాల్లో శనివారం జరిగిన ఇంటర్ (ఒకేషనల్) పరీక్షలకు 97 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించగా, జనరల్‌కు సంబంధించి 51 మందికి గాను 22 మంది హాజరయ్యారు. మరో 29 మంది గైర్హాజరయ్యారు. పేపర్–2కు సంబంధించి 1,697 మందికి గానూ 1,629 మంది హాజరు కాగా.. మరో 68 మంది గైర్హాజరయ్యారు.

ఇలా చేస్తే 'పది'ంతల విజయం

ప్రతి విద్యార్థీ చదువుల పయనంలో పదోతరగతి కీలకం. పాఠశాల చదువు పూర్తి చేసుకుని కళాశాలలోకి తొలి అడుగు పడాలంటే ఈ పరీక్షల్లో రాణించాలి. ఉత్తీర్ణతే కాదు.. ఉత్తమ ఫలితమూ సాధించినప్పుడే ఆశించిన కళాశాలలో చోటు దక్కుతుంది. ఇంతటి కీలకమైన పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. కేవలం ఒక్కరోజు మాత్రమే గడువు ఉండడంతో విద్యార్థుల్లో సహజంగానే ఆందోళన మొదలైంది. అయితే తక్కువ సమయమే అయినా మనసుపెట్టి ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలనే అంశంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు



రాప్తాడు రూరల్: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్ని ఆరు సబ్జెక్టులకు మాత్రమే నిర్వహించనున్నారు. ఈ నెల మూడో తేదీ నుంచి 18వ తేదీ వరకూ నిర్దేశిత రోజుల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాయనున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థిలోనూ సహజంగానే భయం, ఆందోళన నెలకొన్నాయి. ప్రశ్న పత్రం ఎలా ఉంటుంది? జవాబులు ఎలా రాయాలి? ఎన్ని మార్కులు వస్తాయి? తదితర ఎన్నో ప్రశ్నలు విద్యార్థులను అయోమయానికి గురి చేస్తున్నాయి. పరీక్షల తేదీ దగ్గర పడేకొద్దీ ఆందోళన ఎక్కువై ప్రశాంతత లేకుండా పోతుంది.

ప్రశాంతతతోనే ఆశించిన ఫలితాలు..

పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మానసిక ప్రశాంతతతోనే ఆశించిన ఫలితాలు ఉంటాయంటున్నారు. ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి వెళ్లే సమయంలో పుస్తకాలు చదవడం వల్ల ఎలాంటి ఫలితమూ ఉండదంటున్నారు. 'పరీక్ష కేంద్రానికి వెళ్లిన తర్వాత కొద్దిపాటి సమయం ఉంటే ఇంపార్టెంట్, హార్డ్ వర్క్స్ నోట్స్ మాత్రమే పైపైన చూసుకోవాలి. పరీక్షకు బాగా ప్రిపేర్ అయినట్లు మానసికంగా సిద్ధంగా ఉండాలి. పరీక్షలు బాగా రాస్తామనే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. మిమ్మల్ని మీరే ప్రోత్సహించుకోవాలి. రాత్రిపూట ఎక్కువ సమయం మెలుకువతో ఉండకుండా చూసుకోవాలి. సరైన నిద్రలేకపోతే ఒత్తిడికి గురయ్యే ప్రమాదముంది' అని హెచ్చరిస్తున్నారు.

రోజూ ఇలా చేస్తే సరి..

రాత్రి 10 గంటల్లోపు చదువు పూర్తి చేసి ప్రశాంతంగా నిద్రపోవాలి. మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటలకు నిద్రలేచి కాసేపు చదువుకోవాలి. పరీక్షకు వెళ్లేటప్పుడు పరిశుభ్రమైన దుస్తులను ధరించాలి. పాతదైనా పర్వాలేదు కానీ శుభ్రంగా ఉతికి ఇస్త్రీ చేసుకుని వేసుకోవాలి. తల నీటుగా దువ్వుకోవాలి. దీని వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పరీక్షకు వెళ్లేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులను ధరించొద్దు. సాధ్యమైనంత వదులుగా ఉండే దుస్తులే వేసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. అతిగా తిని వెళ్లొద్దు. ఓ గ్లాసు వేడిపాలు తాగితే ఎంతో శక్తి, ఉత్సాహం కలుగుతుంది.

పరీక్ష రోజు ఇలా చేయండి..

పరీక్ష రోజు చాలా ఆత్మవిశ్వాసంతో ఉండాలి. బాగా చదివానని, సమాధానాలు బాగా రాస్తాననే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. మనసులో ఎలాంటి అలజడి ఉండరాదు. నిర్దేశించిన సమయంలో కొన్ని టెక్నిక్స్‌తో తెలివితేటలు ప్రదర్శించి జవాబులు రాయాలి. ముందుగానే హాల్ టికెట్ భద్రపరచుకోవాలి. ప్యాడ్‌తో పాటు కొత్త పెన్నులు, పెన్సిల్ తీసుకెళ్లడం మర్చిపోవద్దు. పరీక్ష సమయానికి కనీసం అరగంట ముందు కేంద్రానికి చేరుకోవాలి. దీనివల్ల మానసిక ఆందోళనకు గురి కాకుండా ఉంటారు.

ఈ జాగ్రత్తలు పాటించండి..

అక్షరాలు మరీ చిన్నవిగా, మరీ పెద్దవిగా కాకుండా స్పష్టంగా అర్థమయ్యేలా రాయండి. ప్రశ్నకు సరైన సమాధానం రాసేందుకు ప్రయత్నించండి. జవాబు రాసేటప్పుడు అనవసరమైన చోట సబ్ హెడ్డింగ్ పెట్టొద్దు. అవసరమైన చోటు మాత్రమే సబ్ హెడ్డింగ్స్ పెట్టండి. ఇలా రాయడం వల్ల ఎక్కువ మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. జవాబు పత్రంలో సాధ్యమైనంత వరకు కొట్టివేతలు ఉండరాదు. జవాబులు నీటుగా రాయడం అలవాటు చేసుకోవాలి. జవాబు పత్రంలో ఒకే మాదిరి జవాబులు రాయొద్దు. పైనుంచి చివరి వరకు పేరాగ్రాఫ్ విభజన చేసి జవాబులు రాయడం మంచిది. ఏదైనా కొత్త పాయింట్ రాసేటప్పుడు మరో పేరాగ్రాఫ్‌ను ప్రారంభించాలి. పది లైన్లకు మించి పేరాగ్రాఫ్ ఉండరాదు.

ప్రశ్నలను అర్థం చేసుకోవాలి..

ఇన్విజిలేటర్ అందజేసే ప్రశ్నాపత్రాన్ని హడావుడిగా కాకుండా ప్రశాంతంగా పరిశీలించి, ప్రశ్నలను బాగా అర్థం చేసుకోవాలి. ముందుగానే ఊహించిన ప్రశ్నలు వచ్చినప్పుడు తొలుత వాటికి జవాబులు రాయాలి. ప్రతి జవాబు చెక్ చేసుకునేందుకు కొన్ని నిమిషాలు కేటాయించుకోవాలి. ఊహించని ప్రశ్న ఎదురైతే ఏ మాత్రం నిరుత్సాహానికి గురికాకూడదు.